రహదారులకు రెండు రోజుల్లో మరమ్మతులు

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రధాన రహదార్లకు రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నగరంలోని ప్రధాన రహదారులు గోతులు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీటిలో కొన్ని ఆర్ అండ్ బీ రోడ్లు కూడా ఉన్నాయని తెలిపారు. నగరంలో ఏ రోడ్డు అయినప్పటికీ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా వాటికి రెండు రోజుల్లో ఏఈల వారీగా మరమ్మతులు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆమె చెప్పారు. ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి విభాగాల వారీగా ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు కూడా విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారు. స్పందన అర్జీల అప్ డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాల పై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌కు ఆమె చెప్పారు. వార్డు సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు.

స్పందనకు 40 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో 40 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 17, ఇంజినీరింగ్ విభాగానికి 12, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 3 చొప్పున ఉన్నాయని వెల్లడించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈ లు, ఎస్ఎస్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదిక అందించాలి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల్ని ఏఈఆర్‌వోలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం ఏఈఆర్‌వోలు, సూపర్వైజరీ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఏఈఆర్‌వోలు తమ పరిధిలో పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఎక్కడైనా కేంద్రాల మార్పులుంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. పరిశీలనలో స్థానిక ఏఈలు కూడా ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది అంతా ఎన్నికల సంఘం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, ఏదైనా కారణంగా సెలవులో ఉన్నప్పటికీ ఫోన్‌లో అందుబాటులో ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నుంచి అందే మార్గదర్శకాల్ని ఆ విభాగం ఎప్పటికప్పుడు వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని కమిషనర్ చెప్పారు. ఓటర్ల నుంచి అందిన ఆయా ఫారాల్ని నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ చేసేలా పర్యవేక్షణ చేయాలని సూపర్వైజరీ అధికారులకు సూచించారు. ఎన్నిల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలి

నెహ్రూనగర్: వార్డు సచివాలయాల వారీగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో వెల్ఫేర్ సెక్రటరీలు బాధ్యతగా వ్యవహరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బొంగరాలబీడు ప్రాంతవాసి పి.శివకుమార్ సోమవారం కమిషనర్‌ని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కలసి దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని అర్జీ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో అర్హత ఉండి ఎవరైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదు ఇస్తే, వెల్ఫేర్ కార్యదర్శులపై చర్యలు తప్పవని తెలిపారు. శివ కుమార్ అందించిన అర్జీని పరిశీలించి, అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని నేరుగా డెప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యం



నెహ్రూనగర్: రాష్ట్రంలో సంక్షేమ పాలన వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని 55వ డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ తెలిపారు. డివిజన్ పరిధిలో కొత్తగా 45 మందికి మంజూరైన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. సందర్భంగా అంబేడ్కర్ మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఎటువంటి సిఫార్సు లేకుండా అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు విజయ్, అంకాల్ రాజ్, పిచ్చయ్య, రాంబాబు, బుజ్జి, చంటి, నాగరాజ్, అంకమ్మరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం అవసరం



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖర రావు, అధికారులు సోమమవారం ఎనిమిది మందికి కారుణ్య నియామకపత్రాల్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు ఉత్తమ సేవలందించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని తెలిపారు.

నేడు వెన్నుముక గాయాలకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: స్పైనల్ కార్డ్ ఇంజ్యూరీ డే సందర్భంగా మంగళవారం వెన్నుముక గాయాలకు ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్పైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ – ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ జె. నరేష్‌బాబు చెప్పారు. గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మల్లిక స్పైన్ సెంటర్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పైనల్ కార్డ్ గాయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల జీవితాంతం మంచానికే పరిమితమై అవస్థలు పడుతున్నట్లు వెల్లడించారు. స్పైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న ప్రపంచ వెన్నుముక గాయం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని పురస్కరించుకుని ఆ రోజు నుంచి వారం రోజుల పాటు గుంటూరులోని మల్లికా స్పైన్ రిహాబ్ సెంటర్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ నరేష్‌బాబు చెప్పారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 14వ లైనులో పగడాల మాధవరావు సెల్‌ఫోన్‌లో సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం అతడ్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి నుంచి రూ. 2,150 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రిటెక్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం: జన్మభూమినగర్‌లోని నూమాక్స్ అగ్రిటెక్ దుకాణంలో గుంటూరు విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజినల్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం ఈ సోదాలు జరిగాయి. దుకాణంలో భారీగా నిల్వ చేసిన పొటాషియం సైనేట్‌ను అధికారులు పరిశీలించారు. అయితే, నిల్వలకు సంబంధించి ఎంట్రీలు రిజిస్టర్‌లో నమోదు కాకపోవడాన్ని గుర్తించారు. దీంతో రూ.1.18 లక్షల ఖరీదు చేసే 250 ప్యాకెట్ల విక్రయాల్ని నిలుపుదల చేసి, యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే ముస్తఫా



రైల్వే ట్రాక్ వద్ద సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: శివారు కాలనీపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 56వ డివిజన్ రైల్వే ట్రాక్, ఒకటో డివిజన్ పరిధిలోని పద్మావతీ నగర్, తారక రామా నగర్, 57వ డివిజన్ పరిధిలోని మంగళదాస్ నగర్‌లో సోమవారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ లీకులు, రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. స్థానిక సమస్యల్ని ఆయా వార్డుల కార్పొరేటర్లు పర్యవేక్షించి నేరుగా తన దృష్టికి తెస్తే, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, మర్రి అంజలి, ఏ. కనకదుర్గ, పార్టీ నేతలు, జీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆ రోజులు ఇక రావు నేస్తం !



1997-98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్‌లోని జ్ఞానోదయ స్కూల్లో సోమవారం 1997–98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం సందడిగా సాగింది. 26 ఏళ్ల కిందట చదువుకున్న విద్యార్థులంతా ఒకచోటకు చేరారు. ఆత్మీయ పలకరింపులతో ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుని సంతోషంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాల తరగతి గదుల్ని సందర్శించి, నాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాల వ్యవస్థాపక నిర్వాహకుడు, ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొడాలి రాజా రామమోహనరావు మృతి అనంతరం పాఠశాల నిర్వహణ నిలిచిపోవడం బాధాకరమని పూర్వ విద్యార్థుల విచారం వ్యక్తం చేశారు. తమ ఉన్నతికి కారకులైన రామమోహనరావు జ్ఞాపకార్థం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూత అందించేందుకు నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి కృషి చేసిని కిలారి రజనీని అభినందించారు.

యార్డుకు 32,439 బస్తాల మిర్చి

కొరిటెపాడు : గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 32,439 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,793 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,443 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు కార్యదర్శి ఐ. వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వృద్ధురాలికి అశ్రమంలో ఆశ్రయం



వృద్ధురాలిని అంబులెన్సులో తరలిస్తున్న కోవిడ్ ఫైటర్స్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అనాథగా చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధురాలికి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం ఆశ్రమం కల్పించారు. జీజీహెచ్ నుంచి ఆమెను సొంత వాహనంలో తరలించి, పొన్నూరులోని గోతాల స్వామి ఆశ్రమంలో చేర్పించారు. ఎవరైనా రోడ్లపై, ఇతర ప్రాంతాల్లో అనాథల్లా కనిపిస్తే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే వారికి ఆశ్రయం కల్పిస్తామని కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు పఠాన్ అల్లాబక్షు తెలిపారు. ట్రస్టు సేవల్ని వినియోగించుకోవాలనుకునేవారు 8143222456–9397602553 నంబర్లను సంప్రదించాలని కోరారు. ప్రతి రోజూ గుంటూరు జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు ఉచిత భోజనం పెడుతున్నామని తెలిపారు. రోగుల్ని ఆసుపత్రి నుంచి ఇంటికి, ఇంటి నుంచి ఆసుపత్రికి ఉచితంగా సొంత అంబులెన్సులో తరలిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పఠాన్ అబ్దుల్ కరీం, పఠాన్ సుభాని, షేక్ యూసూబ్, బలరాం పాల్గొన్నారు.

ఢిల్లీలో అమృత వనం కోసం మట్టి సేకరణ




మట్టిని సేకరిస్తున్న డాక్టర్ ఉమాశంకర్, బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ నేతలంతా దేశమంతా ఇంటింటికీ తిరిగి సేకరించిన మట్టిని ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అమృతవనం ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ గుంటూరు తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. స్థానిక కొత్తపేట శివాలయం వడ్డూరివారి వీధిలో ఆదివారం బీజేపీ ఆరో మండల అధ్యక్షుడు సురేష్ జైన్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఏక్ భారత్– శ్రేష్ఠ భారత్ నినాదం, నా భూమి– నా దేశం కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరిస్తున్నామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని, దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు గుర్తుగా వారిని స్మరించుకుంటూ అమృతవనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్‌గౌడ్, పోతురాజు వెంకటేశ్వర్లు, శేషగిరి బాబూరావు, గురు దత్తు, పలకలూరు శ్రీనివాసరావు, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

తోట రామకృష్ణ ఆధ్వర్యంలో....

ఆజాదికా అమృతోత్సవంలో భాగంగా సోమవారం బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజక కన్వీనర్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సంపత్ నగర్ లో 'నా భూమి–నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు పట్టణ ప్రజలతో పాటు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు నివాసం నుంచి మట్టిని స్వీకరించారు. కార్యక్రమంలో మాగంటి సుధాకర్ యాదవ్, అప్పిశెట్టి రంగా, మాధవరెడ్డి, వనమా నరేంద్ర, రాచమంటి భాస్కర్ పాల్గొన్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



పట్నంబజారు: పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వరలక్ష్మి టిఫిన్స్‌లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఒక్కసారిగా హోటల్‌లో మంటలు వ్యాపించాయి. భయంతో నిర్వాహకులు, హోటల్‌కు వచ్చిన వారు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ లేదా గ్యాస్ సిలిండర్ లీకేజీ వల్ల జరిగిందా ? అనేది తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు

నగరంపాలెం: రౌడీషీటర్ కె.ప్రతాప్‌పై పీడీ యాక్ట్ నమోదుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతాప్‌పై నల్లపాడు, అరండల్‌పేట, లాలాపేట పీఎస్‌ల పరిధిలో జరిగిన హత్య కేసుల్లో ఉన్నాడని పేర్కొన్నారు.

ఆధునిక జీవనశైలితో ఆహారంపై లోపిస్తున్న నియంత్రణ



డాక్టర్ సాహితి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక జీవన శైలితో ఆహారంపై లోపిస్తున్న నియంత్రణ కారణంగా పలువురు అనారోగ్యాల పాలవుతున్నారని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డాక్టర్ సాహితి చందర్లపాటి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం స్కూల్ ఆఫ్ లైఫ్ మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో పోషకాహారం, శారీరక చికిత్స ప్రాధాన్యతపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సాహితి మాట్లాడుతూ మన శరీరం యంత్రం వంటిదని తెలిపారు. ఇంధనం లేకపోతే అది పని చేయని విధంగా మన శరీరం సైతం సక్రమమైన ఆహారం లేకపోతే పని చేయదని తెలిపారు. ఆహారపు ప్రభావం శరీరతత్వం, శరీర రసాయన క్రియలపై ఏ విధంగా ఉంటుందో వివరించారు. కార్బోహైడ్రేట్లు, మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు కలసిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గాయత్రి యనమల మాట్లాడుతూ కాలానుగుణంగా మనుషుల జీవన ప్రమాణాలతో పాటు ఆరోగ్య సమస్యలు సైతం పెరుగుతున్నాయని తెలిపారు. శారీరకంగా సంభవించే అనారోగ్య సమస్యలకు ఎటువంటి మందుల అవసరం లేకుండా ఫిజియోథెరపీతో నయం చేస్తున్న విధానాల్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఆచార్య కె. లలిత, సహాయాచార్యులు డి. కల్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, ఏ. బాజీబాబు, ఎన్. మణికంఠ, అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాప్రస్థానంలో గ్యాస్ చాంబర్ ఏర్పాటుకు విరాళం



కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పార్థసారథి, కుటుంబ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: బొంగరాలబీడులోని మహాప్రస్థానంలో గ్యాస్ చాంబర్ అభివృద్ధి కోసం బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జంగాలపల్లి పార్థసారధిరావు రూ.50,116ను అందజేశారు. మహాప్రస్థాన సేవా సమితి కార్యాలయంలో సోమవారం తల్లిదండ్రులు జంగాలపల్లి ముక్తేశ్వరరావు, సరస్వతమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులతో కలసి చెక్కును కమిటీ సభ్యులు కల్లూరి రమణయ్య, ఎస్. అంకమ్మ చౌదరికి అందజేశారు.

ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, కాపురస్తుడు శ్రీపతి కుమార్ జనేజ గారి కుమారుడు పుష్కర్ జనేజ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని గుంటూరు సిటీ కాపురస్తుడు గార్లపాటి పూర్ణ చంద్రశేఖర రావు గారి కుమారుడు గార్లపాటి వెంకట భాస్కర్ అశ్విన్ కుమార్ గారి రీత్యా క్రయం పొందుటకు నిర్ణయించుకొని విక్రయ ఖరారు పడి కొంత సొమ్మును బయానాగా చెల్లించి అగ్రిమెంటు పొందియున్నారు. సదరు ఆస్తి గార్లపాటి వెంకట భాస్కర్ అశ్విన్ కుమార్ గారికి చెందకపోతే వారి తాతగారైన గార్లపాటి ఆదెయ్య గారి కుమారుడు గార్లపాటి వెంకటేశ్వర్లు గారు వీలునామా వ్రాయించి సదరు వీలునామాను గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 3వ పుస్తకము, నెం. 187/2009 దుగా రిజిస్టరు కాబడిన వీలునామా రీత్యా కొంత ఆస్తిని మరియు గార్లపాటి యుగంధర్ గారి ద్వారా క్రయం పొంది వారికే విక్రయ దస్తావేజు వ్రాయించుకొని సదరు దస్తావేజును నల్లపాడు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము దస్తావేజు నెం1936/2015దుగా రిజిస్టరు కాబడిన రీత్యా కొంత ఆస్తి సంక్రమించి వారు స్వాధీన పర్చుకొని అనుభవించుచున్నట్లు గోరంట్ల గ్రామం ఆర్.యస్ నెం. 83/1రు దాఖలా స్థిరాస్తిపై వారికి మాత్రమే సర్వ హక్కులు గల స్థిరాస్తిని ఏవిధమైన తనఖాలు గాని, భాగలబ్ధి తగాయిదాలు గాని, కోర్టు జప్తులు గాని లేవు అని నమ్మించి నా క్లయింటుకు విక్రయించబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవ్వరికైనను ఏమైన హక్కులు గాని క్లయిములు గాని భాగ లబ్ధి తగాయిదాలు గాని కోర్టు జప్తులు గాని ఏమైన అభ్యంతరములు వగైరాలు ఉన్న యెడల యీ ప్రకటన తేదీ నుండి పది రోజులలోగా మాకు వ్రాత పూర్వకముగా రిజిస్టరు పోస్టు ద్వారా తెలియజేయగలరు. లేనిచో తదుపరి వచ్చు క్లయిములు గాని అభ్యంతరములు గాని చెల్లనేరవు మరియు నా క్లయింటును ఏవిధముగా బైండు చేయజాలవు.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్.డి. ప్రస్తుతం కొరిటిపాడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన గోరంట్ల గ్రామ డి.నెం.83/1రు అసెస్మెంటు నెం. 102113 5825రు డోరు. 11-137లు దాఖలా చ.గ.970-0 స్థిరాస్తి **హద్దులు: తూర్పు:** వేమూరి శ్రీనివాస్ వగైరాలు విక్రయ ఖరారు పడిన ఆస్తి, **దక్షిణం:** మునిసిపల్ రోడ్డు, **పడమర:** మునిసిపల్ రోడ్డు, **ఉత్తరం:** గార్లపాటి యుగంధర్ వగైరాల ఆస్తి యీ నాలుగు హద్దులు మధ్య గల చ.గ.970-0లు లేక చ.మీ. 811-046 స్థిరాస్తి నివేశన స్థలము అందలి ఆర్.సి.సి. మరియు ఏ.సి.సి రేకులు కట్టడములతో సహా.

ఇట్లు

తుళ్ళూరు సూరిబాబు, న్యాయవాది,
23-11-42, లక్ష్మీకాంప్లెక్స్, ఏలూరు బజార్, గుంటూరు-1

ప్రకటన

నా క్లయింట్లు అయిన గుంటూరు సిటీ,పట్టాభిపురం, కాపురస్తులు వేమూరి మల్లికార్జునరావు గారి కుమారుడు వేమూరి శ్రీనివాస్ గారు మరియు బండ్లమూడి శ్రీనివాసరావు గారి కుమారుడు బండ్లమూడి మనోజ్ కుమార్ గార్ల సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్లు యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని గుంటూరు సిటీ కాపురస్తుడు గార్లపాటి పూర్ణ చంద్రశేఖర రావు గారి కుమారుడు గార్లపాటి వెంకట భాస్కర్ అశ్విన్ కుమార్ గారి రీత్యా క్రయం పొందుటకు నిర్ణయించుకొని విక్రయ ఖరారు పడి కొంత సొమ్మును బయానాగా చెల్లించి అగ్రిమెంటు పొందియున్నారు. సదరు ఆస్తి గార్లపాటి వెంకట భాస్కర్ అశ్విన్ కుమార్ గారికి చెందకపోతే వారి తాతగారైన గార్లపాటి ఆదెయ్య గారి కుమారుడు గార్లపాటి వెంకటేశ్వర్లు గారు వీలునామా వ్రాయించి సదరు వీలునామాను గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 3వ పుస్తకము, నెం. 187/2009 దుగా రిజిస్టరు కాబడిన వీలునామా రీత్యా కొంత ఆస్తిని మరియు గార్లపాటి యుగంధర్ గారి ద్వారా క్రయం పొంది వారికే విక్రయ దస్తావేజు వ్రాయించుకొని సదరు దస్తావేజును నల్లపాడు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము దస్తావేజు నెం1935/2015దుగా రిజిస్టరు కాబడిన రీత్యా కొంత ఆస్తి సంక్రమించి వారు స్వాధీన పర్చుకొని అనుభవించుచున్నట్లు గోరంట్ల గ్రామం ఆర్. యస్ నెం. 83/1రు దాఖలా స్థిరాస్తిపై వారికి మాత్రమే సర్వ హక్కులు గల స్థిరాస్తిని ఏవిధమైన తనఖాలు గాని, భాగ లబ్ధి తగాయిదాలు గాని, కోర్టు జప్తులు గాని లేవు అని నమ్మించి నా క్లయింట్లకు విక్రయించబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవ్వరికైనను ఏమైనా హక్కులు గాని, క్లయిములు గాని భాగ లబ్ధి తగాయిదాలు గాని కోర్టు జప్తులు గాని ఏమైనా అభ్యంతరములు వగైరాలు ఉన్న యెడల యీ ప్రకటన తేదీ నుండి పది రోజులలోగా మాకు వ్రాత పూర్వకముగా రిజిస్టరు పోస్టు ద్వారా తెలియజేయగలరు. లేనిచో తదుపరి వచ్చు క్లయిములు గాని అభ్యంతరములు గాని చెల్లనేరవు మరియు నా క్లయింట్లను ఏవిధముగా బైండు చేయజాలవు.

షెడ్యూలు:– గుంటూరు జిల్లా, గుంటూరు సబ్.డి ప్రస్తుతం కొరిటిపాడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన గోరంట్ల గ్రామ డి.నెం.83/1రు అసెస్మెంటు నెం.1021135825రు డోరు. 11-137లు దాఖలా తూర్పు వైపున చ.గ. 482-0 స్థిరాస్తి హద్దులు: **తూర్పు:** గార్లపాటి సాత్విక్ వగైరాల ఆస్తి హద్దు, **దక్షిణ:** మునిసిపల్ రోడ్డు హద్దు, **పడమర:** పుష్కర్ జనేజ విక్రయ ఖరారు పడిన ఆస్తి హద్దు, **ఉత్తరం:** గార్లపాటి యుగంధర్ వగైరాల ఆస్తి.

యీ నాలుగు హద్దులు మధ్య గల చ.గ.482-0లు లేక చ.మీ. 403-01 స్థిరాస్తి నివేశన స్థలము అందలి ఆర్.సి.సి. మరియు ఏ.సి.సి రేకులు కట్టడములతో సహా..

ఇట్లు

తుళ్ళూరు సూరిబాబు, న్యాయవాది,
డోర్.నెం. 23-11-42, లక్ష్మీకాంప్లెక్స్, ఏలూరు బజార్, గుంటూరు-1

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

LiFE Lifestyle for Environment

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు

డి.నెం.135-43, 1వ అంతస్థు, యస్‌బిఐ పైన, లక్ష్మీ కాంప్లెక్స్, జెకెసి కాలేజ రోడ్, గుంటూరు. ఫోన్ : 0863 - 2215537

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533 తేది.14-09-2006 అనుసరించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, గుంటూరు వారు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా **M/s. తేజస్వి గ్రానైట్స్, మైనింగ్ ఆఫ్ బ్లాక్ గ్రానైట్ – 4932 m3/సంవత్సరం, సర్వే నెం.382/1సిపి, 382/1డి మరియు 400/1ఇ, యడవల్లి (గ్రామం), చిలకలూరిపేట (మండలం), పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద రూ.77.70 లక్షల పెట్టుబడితో** ప్రతిపాదన మూలధన వ్యయంతో ప్రాజెక్ట్ వివరాలు ఈ క్రింద విధముగా పొందుపర్చబడినది.

1	కంపెనీ పేరు చిరునామాతో	M/s. తేజస్వి గ్రానైట్స్, మేనేజింగ్ పార్టనర్ : శ్రీమతి పి. శ్రీలక్ష్మి, భర్త : వెంకట సుబ్బారావు, హౌస్ నెం.120/2, వార్డు-5, కోటకట్ల బజార్, రామాలయం దగ్గర, చీమకుర్తి గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్, మొబైల్ : 9440527080 ఇ-మెయిల్ : tejaswaigranites@gmail.com
2	ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్రదేశం, సర్వే నెంబర్లు మరియు స్థలము/ల కొలతలు	సర్వే నెంబర్లు : 382/1సిపి, 382/1డి మరియు 400/1ఇ, యడవల్లి గ్రామం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3	సంప్రదించవలసిన అధీకృత వ్యక్తి పేరు, చిరునామా & ఫోన్ నెం.	శ్రీమతి పి. శ్రీలక్ష్మి, భర్త : వెంకట సుబ్బారావు, M/s. తేజస్వి గ్రానైట్స్, హౌస్ నెం.120/2, వార్డు-5, కోటకట్ల బజార్, రామాలయం దగ్గర, చీమకుర్తి గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా. మొబైల్ : 9440527080
4	ప్రాజెక్ట్ అంచనా వ్యయం	రూ.77.70 లక్షలు
5	కార్యకలాపాల వివరములు మరియు సామర్థ్యం	బ్లాక్ గ్రానైట్ సంవత్సరమునకు సగటున 4932 క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి చేయడానికి 2.836 హెక్టార్లు (7 ఎకరాలు) విస్తీర్ణంలో ప్రతిపాదన
6	బహిరంగ విచారణ తేది / ప్రదేశం / సమయం	తేది : 06-10-2023 (శుక్రవారం) సమయం : ఉదయం గం॥ 10:30 ని॥లకు ప్రదేశం : ప్రతిపాదిత స్థలం దగ్గర, M/s. తేజస్వి గ్రానైట్స్, సర్వే నెం.382/1సిపి, 382/1డి మరియు 400/1ఇ, యడవల్లి గ్రామం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా.

7. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కార్యనిర్వాహక సారాంశము (తెలుగు మరియు ఆంగ్లం) మరియు పర్యావరణ ప్రభావ అంచనా రిపోర్టులు ప్రజల పరిశీలనార్థం దిగువ ప్రదేశములనందు ఉంచడమైనది.

1. కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
2. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వారి కార్యాలయం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
3. ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, గుంటూరు.
4. రీజనల్ ఆఫీస్ (సౌత్ జోన్), మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్ ఎన్విరాన్‌మెంట్ & క్లైమేట్ ఛేంజ్, జి.ఓ.ఐ, సదరన్ రీజియన్, 1వ మరియు 2వ అంతస్థు, హెచ్ఇపిసి బిల్డింగ్, నెం.34, కెథిడ్రల్ గార్డెన్ రోడ్, నుంగంబాకం, చెన్నై-600034.
5. మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డ్, పర్యావరణ్ భవన్, ఎపిఐఐసి కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ-520007.
6. జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయం, ఫ్లాట్ నెం.41, కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీ, గురునానక్ రోడ్, విజయవాడ.
7. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, డి.నెం.135-43, మొదటి అంతస్థు, యస్‌బిఐ బిల్డింగ్ పైన, లక్ష్మీ కాంప్లెక్స్, జెకెసి కాలేజ్ రోడ్, గుంటూరు.
8. జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల అధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
9. తహసీల్దార్ వారి కార్యాలయం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా.
10. తహసీల్దార్ వారి కార్యాలయం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
11. గ్రామ సెక్రటరీ మరియు పంచాయతీ వారి కార్యాలయాలు : పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మరియు నరసరావుపేట మండలాలలో గల యడవల్లి, కట్టుబడివారిపాలెం, గోపాలంవారిపాలెం మరియు కొండకావూరు గ్రామములు.

ఈ ప్రతిపాదిత కార్యకలాపాల వలన పర్యావరణ పరంగా ఇబ్బందులను ఎదుర్కొనువారు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, భారతప్రభుత్వం వారిచే జారీచేయబడిన పర్యావరణ ప్రభావ అంచనా ప్రకటన నెం. **యస్.ఓ.1533, తేది.14-09-2006** మరియు తదుపరి సవరణలను అనుసరిస్తూ ప్రతిపాదిత ప్రాజెక్ట్ ఏర్పాటుపై ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు, ఇబ్బందులు, వ్యాఖ్యలు ఏమైనా ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన **30 రోజులలోపు** లిఖితపూర్వకముగా క్రింది సంతకందారునకు తెలియపరచమని కోరడమైనది. లేదా పైన పేర్కొనబడిన తేది, సమయం, వేదిక నందు జరుగు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు, ఇబ్బందులు, వ్యాఖ్యలను తెలియజేయవచ్చును. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆరోగ్య మంత్రిత్వశాఖలు జారీచేయుచున్న సూచనలు మరియు ఆదేశాలననుసరించి కోవిడ్-19 నియమనిబంధనలు పాటించుచూ ప్రజాభిప్రాయ సేకరణ జరుపబడునని తెలియజేయడమైనది.

ప్రదేశం : గుంటూరు
తేది : 04-09-2023

సం/- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, గుంటూరు.